శనివారం 11-05-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 331 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com


## కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్

**జూన్ 1 వరకు అనుమతి ఇచ్చిన సుప్రీంకోర్టు • ఎన్నికల ప్రచారం చేయనున్న కేజ్రీవాల్**

**ముందడుగు ఢిల్లీ:**

ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు లోక్‌సభ ఎన్నికల వేళ భారీ ఊరట లభించింది. మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో సుప్రీం కోర్టు ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రచారం నిమిత్తం జూన్ 1 వరకు ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ సుప్రీంకోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. మద్యం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై మార్చి 21న కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అంతకుముందు ఈ కేసులో విచారణకు రావాలంటూ దర్యాప్తు సంస్థ తొమ్మిదిసార్లు సమన్లు జారీ చేసింది. వాటికి స్పందించకపోవడంతో అదుపులోకి తీసుకుంది. ప్రస్తుతం ఆయన తిహాడ్ జైలులో జ్యుడిషియల్ కస్టడీలో ఉంటున్నారు. ఇదిలా ఉండగా.. తన అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలోనే ఆయన మధ్యంతర బెయిల్‌పై విచారణ జరిపిన ధర్మాసనం.. తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.





**రూ.10 లక్షలు ఇస్తే నీట్ పరీక్ష రాస్తా**

వివరాలు 3లో



**ఆంధ్రా ఎన్నికలపై ముందడుగు సర్వే**

వివరాలు 4లో

## వేములవాడకు మోడీ రూపాయి ఇవ్వలే

- దేవస్థానాన్ని బాగు చేస్తామని కూడా చెప్పలే
- మోడీపై తీవ్రస్థాయిలో కేసీఆర్ విమర్శలు



**ముందడుగు కరీంనగర్:**

నిన్న ఈ వేములవాడకు ప్రధాని మోడీ వచ్చారు. ఆయన పక్కనే బండి సంజయ్ ఉన్నాడు. దేశం కోసం ధర్మం కోసం అని మాట్లాడే ప్రధాని మోడీ, హిందూ హిందూ అని మాట్లాడే బండి సంజయ్ వేములవాడకు ఒక్క రూపాయి ఇవ్వలేదు. వేములవాడ దేవస్థానాన్ని బాగు చేస్తామని చెప్పారా..? అది కూడా లేదని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణకు చేసిందేమీ లేదని కేసీఆర్ మండిపడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో

మిగతా 2లో

## భారత విరోధులు పారిపోక తప్పదు

- కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం వద్దనుకున్నారు
- తెలంగాణ ప్రజల కలలు బిజెపి నెరవేర్చుతోంది
- హైదరాబాద్ ఎల్బీస్టేడియంలో నరేంద్ర మోడీ

**ముందడుగు హైదరాబాద్:**

తెలంగాణ ప్రజలు కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం వద్దని నిర్ణయించుకున్నారని, బిజెపిని గెలిపించుకోవాలని కృత నిశ్చయంతో ఉన్నారని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. దేశంలోని 140 కోట్ల మంది కాషాయ పార్టీని గెలిపించాలని సంకల్పం తీసుకున్నారన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్ ఎల్బీస్టేడియంలో నిర్వహించిన బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. జూన్ 4 తర్వాత భారత విరోధులు పారిపోక తప్పదని హెచ్చరించారు.

'జూన్ 4 తర్వాత ఉమ్మడి పౌరస్మృతి వద్దన్నవారు, ఆర్టిక్ 370 రద్దు వ్యతిరేకులు పారిపోక తప్పదు. మధ్య తరగతి ప్రజల కలలను భాజపా సర్కారు నెరవేరుస్తోంది. పదేళ్లలో ఎన్నో సమస్యలకు ఎన్డీయే ప్రభుత్వం పరిష్కారం చూపింది. డిజిటల్ రంగంలో, అంకుర సంస్థల్లో నేడు భారత్ సూపర్ పవర్. దేశాన్ని లూటీ చేయడం, వారసత్వ రాజకీయాలు చేయడంలో కాంగ్రెస్‌ది ట్రాక్ రికార్డు. కాంగ్రెస్ పాలనలో నగరంలో ఎన్నోచోట్ల బాంబు పేలుళ్లు జరిగాయి. వారి పాలనలో ఎక్కడికెళ్లాలన్నా భయపడాల్సి వచ్చేది. భారతీయుల పట్ల కాంగ్రెస్ నేతలు జాతి వివక్ష వ్యాఖ్యలు చేస్తున్నారు. కాంగ్రెస్ రాకుమారుడి గురువు మనల్ని ఆఫ్రికన్లు అని మాట్లాడారు.





**ఇంకెన్ని సంవత్సరాలు మోసపోతారు**

వివరాలు 4లో

**ఓటు కోసం కదిలిన ఆంధ్రా జనం**

వివరాలు 2లో

## కారు తుప్పుపట్టిందని కెసిఆర్ బస్సెక్కాడు

- బిజెపి మాటలు నమ్మి మోసపోవద్దు
- షాద్‌నగర్ జనజాతర సభలో రేవంత్‌రెడ్డి

**ముందడుగు మహబూబ్‌నగర్:**

హైదరాబాద్‌కు ఓఆర్ఆర్, విమానాశ్రయం, పరిశ్రమలను గత కాంగ్రెస్ ప్రభుత్వమే తీసుకొచ్చిందని గుర్తు చేసిన రేవంత్‌రెడ్డి అవన్నీ వచ్చాకే రంగారెడ్డి జిల్లాలో భూముల ధరలు అమాంతం పెరిగాయన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్‌లో నిర్వహించిన కాంగ్రెస్ జనజాతర బహిరంగ సభలో రేవంత్ ప్రసంగించారు. మత కలహాలు లేవు కాబట్టే హైదరాబాద్ ఖ్యాతి అంతర్జాతీయంగా పెరిగింది. గుజరాత్ కంటే హైదరాబాద్ ఖ్యాతి పెరగడంతో దానిని తగ్గించేందుకు కుట్రలు చేస్తున్నారు. మతచిచ్చు పెట్టి శాంతిభద్రతలు చెడగొట్టాలని చూస్తున్నారు. బిజెపి వాళ్ల మాటలు

మిగతా 2లో



ముందడుగు
శనివారం, 11-05-2024, హైదరాబాద్

## వేములవాడకు మోడీ
# రూపాయి ఇవ్వలే

మొదటిపేజీ తరువాయి

కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా.. దేవుని పేరు కూడా ఉండాలని వేములవాడ రాజన్న పేరును సిరిసిల్ల జిల్లాకు పెట్టుకున్నాం. లోక్‌సభ ఎన్నికల్లో మూడు పార్టీలు రంగంలో ఉన్నాయి. ఏ పార్టీలు ఏం చేశాయో మీకు అందరికీ బాగా తెలుసు. వేములవాడ దేవస్థానం ఇరుకుగా ప్లేస్ ఉందని చెప్పి నేను అక్కడొచ్చి 35 ఎకరాలు ఇప్పించి అభివృద్ధి చేసే ప్రయత్నం చేశాను. బండి సంజయ్ రూపాయి అడగలేదు.. మోదీ ఇవ్వలేదు అని కేసీఆర్ మండిపడ్డారు.

# కారు తుప్పుపట్టిందని కెసిఆర్ బస్సెక్కాడు

మొదటిపేజీ తరువాయి

నమ్మి రాష్ట్రాన్ని ఆగం చేసుకోవద్దు. ఎయిర్‌పోర్టు వరకు మెట్రో తెస్తా. ఆ తర్వాత షాద్‌నగర్ వరకు విస్తరిస్తా. ముదిరాజ్‌లను బీసీఏలో చేర్చేందుకు కృషి చేస్తాం. పాలమూరు బిడ్డకు, ఢిల్లీ సుల్తాన్‌లకు మధ్య జరుగుతున్న పోరు ఇది. షెడ్డుకు పోయిన కారు.. మళ్లీ తిరిగిరాదని చెప్పాను. కారు తుప్పుపట్టిపోయినందువల్లే.. కేసీఆర్ బస్సెక్కి తిరుగుతున్నారు'' అని రేవంత్ వ్యాఖ్యానించారు.

# ఓటు కోసం కదిలిన ఆంధ్రా జనం

- జంట నగరాల నుంచి ఎక్కువ ప్రయాణం
- కిటకిటలాడుతున్న రైళ్లు, బస్సులు
- టీఎస్ఆర్టీసీ సుమారు 2 వేల ప్రత్యేక బస్సులు





**ముందడుగు హైదరాబాద్:**

ఆంధ్రాలో ఈనెల 13న శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు ఉండటంతో ఓటు హక్కు వినియోగించుకునేందుకు హైదరాబాద్‌లో నివసించే ఏపీ వాసులంతా తమ స్వగ్రామాలకు తరలివెళ్తున్నారు. జంట నగరాల నుంచి ఒకేసారి ఎక్కువ సంఖ్యలో ప్రజలు ఓట్ల పండుగకు వెళ్తుండటంతో రైళ్లు, బస్సులు కిటకిటలాడుతున్నాయి. రాష్ట్ర భవిష్యత్ కోసం ఎలాగైనా తమ ఓటు హక్కు వినియోగించుకుంటామని స్పష్టం చేస్తున్నారు.

స్వగ్రామాలకు వెళ్లేందుకు ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు, రైళ్లను ఎంచుకుంటున్నారు. మరి కొందరు సొంత వాహనాల్లో వెళ్తున్నారు. దీంతో నగరమంతా దాదాపుగా ఖాళీ అవుతోంది. పది రోజుల నుంచే బస్సుల్లో సీట్లన్నీ ఫుల్ అయ్యాయి. ముఖ్యంగా విజయవాడ, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఒంగోలు, గుంటూరు తదితర జిల్లాలకు వెళ్లే వారితో ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, కూకట్‌పల్లి, సాగర్ రింగ్‌రోడ్డు బస్టాప్‌లలో ప్రయాణికుల రద్దీ నెలకొంది. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా టీఎస్ఆర్టీసీ సుమారు 2 వేల ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఎంజీబీఎస్ నుంచి 500, జేబీఎస్ నుంచి 200, ఉప్పల్ నుంచి 300, ఎల్బీనగర్ నుంచి 300 ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉన్నాయి. శుక్ర, శని, ఆదివారాల్లో నడిచే 450 బస్సుల్లో ఇప్పటికే రిజర్వేషన్లు పూర్తయ్యాయి. ప్రయాణికుల రద్దీ మేరకు టీఎస్ఆర్టీసీ బస్సులు నడపనుంది.

# మరోసారి భారీ ఎన్‌కౌంటర్

- బీజాపూర్ జిల్లాలో ఎదురుకాల్పులు
- 12 మంది నక్సలైట్లు మృతి



**ముందడుగు ఛత్తీస్‌గఢ్ :**

దేశంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల వేళ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మరోసారి భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. బీజాపూర్ జిల్లాలో భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో 12 మంది నక్సలైట్లు మృతి చెందారు. దీంతో మరోసారి మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలినట్లయింది. ఇటీవల జరిగిన ఎదురుకాల్పుల్లో 29 మంది మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. తాజాగా ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగలూరు పోలీస్ స్టేషన్ పరిధి పిడియా గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు శుక్రవారం యాంటీ నక్సల్స్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలోనే మావోయిస్టులు కాల్పులు జరపడంతో.. భద్రతా దళాలు ఎదురు కాల్పులు జరిపాయి. ఈ ఎదురుకాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మృతి చెందారు.

ఘటనా స్థలం నుంచి ఐదుగురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. భద్రతా సిబ్బంది సురక్షితంగా ఉన్నారని పోలీసు అధికారులు తెలిపారు. స్థానికంగా గాలింపు కొనసాగుతున్నట్లు వెల్లడించారు.



## చివరి నిమిషంలో
# నామినేషన్ దాఖలు
### పరుగులు పెట్టిన బిజెపి అభ్యర్థి

**ముందడుగు ఉత్తరప్రదేశ్ :**

ఉత్తరప్రదేశ్‌లోని దేవరియా ప్రాంతం నుంచి శశాంక్ మణి త్రిపాఠిని భాజపా బరిలోకి దింపింది. ఆయన గురువారం చివరి నిమిషంలో నామినేషన్ వేశారు. దానికి ముందు తన కోసం ఏర్పాటుచేసిన ఒక కార్యక్రమానికి హాజరుకావడం ఆలస్యానికి కారణమైంది. నామినేషన్ స్వీకరణ ప్రక్రియ ఉదయం 11 గంటలకు మొదలై.. మధ్యాహ్నం మూడు గంటలతో ముగుస్తుంది. ఆ గడువుకు 15 నిమిషాలే ఉండటంతో త్రిపాఠి 100 మీటర్ల దూరం పరిగెత్తుకుంటూ వెళ్లారు. అప్పుడు ఆయన వెంట పలువురు బిజెపి నేతలు ఉన్నారు. వారు కూడా ఆయన వెంట పరుగుతీసి, రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లారు. ఈ దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట్లో వైరల్‌గా మారాయి.

# రైలు టికెట్ క్యాన్సల్ సొమ్ము ఆరు గంటల్లోనే
### వేసవి రద్దీ నేపథ్యంలో రైల్వే తాజా నిర్ణయం

**ముందడుగు ఢిల్లీ:**

ఆన్‌లైన్‌లో బుక్ చేసిన ట్రైన్ టికెట్‌ను ఏదైనా కారణంతో క్యాన్సిల్ చేస్తే ఆ సొమ్ము వెనక్కి రావడానికి కొన్ని రోజుల సమయం పడుతుంది. తాజాగా ఆ రిఫండ్ల ప్రక్రియను వేగవంతం చేసింది. క్యాన్సిల్ చేసుకుంటున్న ఇ టికెట్లకు సంబంధించి దాదాపు 50 శాతం రిఫండ్లను కేవలం ఆరు గంటల్లోనే సెటిల్ చేస్తున్నట్లు ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. రద్దు చేసుకున్న ఇటికెట్లతో పాటు టీడీఆర్ ఫైలింగ్ విషయంలోనూ 98 శాతం క్లెయిమ్‌లను ఒక రోజులోనే పరిష్కరిస్తున్నట్లు తెలుస్తోంది.

సాధారణంగా రైల్వే టికెట్‌ను క్యాన్సిల్ చేసుకున్నప్పుడు, వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న సందర్భంలో క్యాన్సిల్ అయినప్పుడు రిఫండ్లకు కనీసం 34 రోజుల గడువు పడుతోంది. టికెట్ డిపాజిట్ రిసీట్ విషయంలో మరింత ఎక్కువ సమయం పడుతోంది. మానవ సంబంధం లేకుండా అన్నీ ఆటోమేటిక్‌గా జరుగుతున్న వేళ.. రిఫండ్ల జారీకి మాత్రం ఎందుకింత ఆలస్యం జరుగుతోందన్న ప్రశ్న ప్రయాణికుల నుంచి ఉత్పన్నం అవుతోంది. దీంతో రిఫండ్ల జారీని రైల్వే వేగవంతం చేసింది. వేసవి రద్దీ నేపథ్యంలో రైల్వే తాజా నిర్ణయం ప్రయణికులకు ఊరట కల్పించేదే.



## పవన్‌కల్యాణ్‌కు తన మద్దతు ప్రకటించిన అల్లు అర్జున్

జనసేన అధ్యక్షుడు, జనాసేనాని పవన్‌కల్యాణ్ మీద తన అభిమానాన్ని, ప్రేమను మరోసారి చాటుకున్నారు ఐకాన్‌స్టార్ అల్లు అర్జున్. ''మీరు ఎంచుకున్న నిస్వార్థమైన మీదారిని. ప్రజల సేవలకు మీ జీవితాన్ని అంకితం చేసిన విధానం చూసి నేను ఎప్పూడు గర్వపడతుంటాను. మీ కుటుంబ సభ్యుడిగా, నా ప్రేమ, మద్దతు మీతో ఎప్పుడూ వుంటాయిమీ రాజకీయ ప్రస్థానంలో మీరు కోరుకున్నవి అన్నీ సాకారం కావాలని, మీ రాజకీయ ప్రయాణం విజయకేతనం ఎగురవేయాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను' అంటూ తన సోషల్ మీడియా వేదికగా జనసేనాని పవన్‌కల్యాణ్‌కు తన మద్దతు ప్రకటించారు అల్లు అర్జున్.

ముందడుగు
శనివారం, 11-05-2024, హైదరాబాద్

# తెరుచుకున్న కేదార్ నాథ్ ఆలయ తలుపులు

## తొలి పూజలో పాల్గొన్న ఉత్తరాఖండ్ సీఎం

**ముందడుగు ఉత్తరాఖండ్:**



వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య ఉదయం 7 గంటలకు ఉత్తరాఖండ్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన కేదార్ నాథ్ ఆలయం తలుపులు శుక్రవారం తెరుచుకున్నాయి. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి కుటుంబంతో కలిసి తొలి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేదారేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పరమేశ్వరుడి పవిత్ర ఆలయాలైన 12 జ్యోతిర్లింగాల్లో కేదార్‌నాథ్ ఆలయం ఒకటి. చార్‌ధామ్ యాత్రలో కేదార్ నాథ్ దేవాలయం సందర్శన భాగంగా ఉంటుంది. ఏటా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షల మంది భక్తులు కేదార్‌నాథ్‌కు చేరుకుని పరమేశ్వరుడ్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తుంటారు. శీతాకాలం సందర్భంగా ఈ ఆలయాన్ని మూసివేస్తారు. దాదాపు ఆరు నెలల పాటు మూసి ఉన్న ఈ ఆలయ తలుపులు భక్తుల దర్శనార్థం నేడు తెరిచారు. ఈ సందర్భంగా ఆలయాన్ని అధికారులు సర్వాంగ సుందరంగా అలంకరించారు. సుమారు 40 క్వింటాళ్ల పూలతో అందంగా ముస్తాబు చేశారు. భక్తులు ఉదయం నుంచే ఆలయానికి క్యూ కట్టి కేదారేశ్వరుడిని దర్శించుకుంటున్నారు.

# మద్యం మత్తులో అమ్మాయిలు వీరంగం

## ఇన్‌స్పెక్టర్ కాలర్ పట్టుకుని గొడవ

**ముందడుగు ముంబాయి:**



ముగ్గురు అమ్మాయిలు మద్యం మత్తులో వీరంగం సృష్టించారు. మహారాష్ట్ర ముంబై సమీపంలోని విరార్ ప్రాంతంలో అర్ధరాత్రి హల్‌చల్ చేశారు. వికృతచేష్టలతో స్థానికులను ఇబ్బందులకు గురిచేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా.. మహిళల్లో ఒకరు ఏకంగా ఇన్‌స్పెక్టర్ కాలర్ పట్టుకుని గొడవకు దిగింది.

పోలీసులను దుర్భాషలాడుతూ, అసభ్యకరంగా ప్రవర్తించారు. ఓ యువతి మహిళా కానిస్టేబుల్ చేతిని కొరికి గాయపరిచింది. దీంతో అక్కడ గందరగోళ పరిస్థితి తలెత్తింది. పోలీసులు అతి కష్టం మీద ఆ ముగ్గురిని నియంత్రించి అదుపులోకి తీసుకున్నారు. వారిపై ఐపీసీ సెక్షన్ 353, 323, 325, 504, 506 కింద కేసు నమోదు చేశారు. అనంతరం వారిని కోర్టు ముందు హాజరుపరిచారు. ఘటనకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.

# నేటితో ముగియనున్న ప్రచారం

**ముందడుగు, స్టేట్ బ్యూరో:**

- **45 రోజులు ముమ్మరంగా ప్రచారం**
- **రాష్ట్రంలో అగ్ర నాయకులతో రోడ్‌షోలు, సమావేశాలు, సభలు**
- **4న ఎన్నికల కౌంటింగ్**

లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి నేటితో తెరపడనుంది. ఏప్రిల్ 18న కేంద్ర ఎన్నికల కమిషన్ తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రధాన పార్టీల అభ్యర్థుల టికెట్లు ఖరారు కావడంతో అభ్యర్థులంతా ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారు. దాదాపు 45 రోజులుగా ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తుండగా, ఓటర్లను ఆకట్టుకునేందుకు రకరకాల ఫీట్లు చేశారు. అగ్ర నాయకులతో రోడ్‌షోలు, సమావేశాలు, సభలు ఏర్పాటు చేస్తూ ప్రచారంలో దూసుకుపోయారు. ఎన్నికల ప్రచారపర్వాన్ని ఈ నెల 11 సాయంత్రం 5 గంటల వరకు ముగించాల్సి ఉంది. దీంతో ఓటర్లను ఆకర్షించేందుకు అభ్యర్థుల తరపున ఆయా పార్టీల నాయకులు రంగంలోకి దిగారు. కాగా, ఎన్నికల ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న చేపట్టనున్నారు. ప్రచారం ముగుస్తుండడం, ఎన్నికలకు మరో రెండు రోజులు గడువు ఉండడంతో ప్రలోభాలకు తెరతీసే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తి చేసిన అభ్యర్థులు అందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఓటర్లకు పంపిణీ చేసేందుకు నగదు, మద్యం సమకూర్చుకున్నట్లు తెలుస్తోంది. ప్రచారపర్వం ముగియగానే నగదు, మద్యాన్ని నేరుగా ఓటర్లకు అందజేసే ఏర్పాట్లు రహస్యంగా జరుగుతున్నాయి. ఎన్నికలను పురస్కరించుకొని రెండు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా, బార్లు, మద్యం షాపులను మూసివేయాలని ఎక్సైజ్ శాఖ ఆదేశించింది. జిల్లాలోకి ఇప్పటికే పెద్దమొత్తంలో మద్యం డంపు కాగా, రాబోయే 24 గంటల వ్యవధిలో మరింతగా సేకరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మద్యం, డబ్బు పంపిణీకి సంబంధించి గ్రామాలు, మున్సిపాలిటీల్లో వార్డు ప్రకారం ఆయా పార్టీల నుంచి ఇన్‌చార్జిలను నియమించినట్లు సమాచారం.

# రూ.10 లక్షలు ఇస్తే నీట్ పరీక్ష రాస్తా

**16 మంది అభ్యర్థులతో టీచర్ ఒప్పందం • గోద్రా స్కూల్‌లో బయటపడిన మోసం**

**ముందడుగు గుజరాత్:**



దేశవ్యాప్తంగా నీట్ యూజీ పరీక్ష మే 6వ తేదీన జరిగింది. గుజరాత్‌లోని ఓ కేంద్రంలో ఈ పరీక్ష నిర్వహణలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. గత ఆదివారం గోద్రా స్కూల్‌లో నీట్ ప్రవేశ పరీక్ష జరిగింది. ఇందులో కొందరు మోసాలకు పాల్పడుతున్నారని విశ్వసనీయ వర్గాల నుంచి జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందింది. దీంతో అదనపు కలెక్టర్, జిల్లా విద్యా అధికారుల బృందం వెంటనే స్కూల్‌కు చేరుకుని ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా ఆ టీచర్ నిర్వాకం బయటపడింది. ఈ స్కూల్‌లో ఫిజిక్స్ టీచర్‌గా పనిచేస్తున్న తుషార్ భట్.. నీట్ పరీక్షకు డిప్యూటీ సూపరింటెండెంట్‌గా వ్యవహరించారు. ఈ ఎగ్జామ్‌లో మెరిట్ కోసం 16 మంది అభ్యర్థులతో అతడు ఒప్పందం కుదుర్చుకున్నాడు.

వచ్చిన జవాబులు రాసి.. రాని వాటిని ఖాళీగా వదిలేసి వెళ్లాలని వారికి చెప్పాడు. పరీక్ష పూర్తయిన తర్వాత పేపర్లు తీసుకుని తానే వాటిని పూర్తి చేస్తానని హామీ ఇచ్చాడు. ఇందుకు గానూ ఒక్కో అభ్యర్థి రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అతడి సలహా మేరకు ఓ అభ్యర్థి ముందుగానే రూ.7లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. విద్యాశాఖ అధికారులు తుషార్ భట్‌ను ప్రశ్నించగా ఈ మోసాన్ని అంగీకరించాడు. అతడి మొబైల్ నుంచి ఆ 16 మంది అభ్యర్థుల పేర్లు, రోల్ నంబర్లను గుర్తించారు. నిందితుడి కారు నుంచి అడ్వాన్స్ డబ్బును స్వాధీనం చేసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తుషార్, అతడికి సాయం చేసిన మరో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# ఇద్దరు భార్యలు ఉంటే ఈ పథకం కింద రూ.2లక్షలు

## కేంద్ర మాజీ మంత్రి విస్తుగొలిపే హామీలు

**ముందడుగు మధ్యప్రదేశ్:**



దేశంలో లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థులు తమ గెలుపు కోసం శాయశక్తులా కృషిచేస్తున్నారు. ఈ క్రమంలో విచ్చలవిడి హామీలు ఇస్తూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. తాజాగా మధ్యప్రదేశ్ రత్లాం లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి, కేంద్ర మాజీ మంత్రి కాంతిలాల్ భూరియా ఇచ్చిన ఎన్నికల హామీ ఇప్పుడు విస్తుగొలిపేలా ఉంది. గురువారం సైలనాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో కాంతిలాల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తే మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు రూ.లక్ష ఆర్థిక సాయం ఇస్తుందని తెలిపారు. ఆ సొమ్ము నేరుగా మహిళ ఖాతాలో జమఅవుతుందని తెలిపారు. ఇద్దరు భార్యలు ఉన్న వ్యక్తి ఈ పథకం కింద రూ. 2లక్షలు పొందుతారని పేర్కొంటూ వివాదాస్పదమయ్యారు. 'కాంగ్రెస్ మేనిఫెస్టోలో మహాలక్ష్మి పథకం కింద ఏటా ప్రతి మహిళ ఖాతాలో రూ.లక్ష వేస్తామని హామీ ఇచ్చాం. ఇద్దరు భార్యలు ఉంటే ఇరువురికీ చెరో లక్ష చొప్పున రూ.2 లక్షలు వేస్తాం' అని కాంతిలాల్ అన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో గిరిజన వ్యవహారాల శాఖ మంత్రిగా పనిచేసిన ఆయన ఇలాంటి హామీలు ఇవ్వడంపై బీజేపీ నేతలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు.

ముందడుగు
శనివారం,
11-05-2024,
హైదరాబాద్





# ఆంధ్రా ఎన్నికలపై ముందడుగు సర్వే

## ప్రజలతో పలు అభిప్రాయాలు సేకరణ • ఉత్తర విశాఖతో ప్రత్యేక దృష్టి

**ముందడుగు విశాఖపట్నం:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికలపై ముందడుగు బృందం సర్వే నిర్వహించింది. గత నెల రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాలలో ముందడుగు బృందం ఆన్ లైన్, ఆఫ్ లైన్ ద్వారా ఓటర్ల అభిప్రాయాలను సేకరించింది. అధికారంలో ఉన్న ప్రభుత్వం పనితీరు ఏలా ఉంది. ఎవరికి ఓటేస్తారు. ఏ ప్రాతిపదికన మీ నియోజకవర్గ నాయకులను ఎంపిక చేసుకుంటారు అనే పలు అంశాలకు సంబంధించి వివరాలు సేకరించారు.

### ఉత్తర విశాఖ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి

ముందడుగు బృందం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా వివిధ రకాలుగా సర్వే నిర్వహించగా విశాఖపట్టణంలోని మాజీ సిబిఐ జెడీ లక్ష్మినారాయణ పోటీ చేస్తున్న నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ నియోజకవర్గంలో ప్రజలు కులం, మతం, విద్య, అభివృద్ధి వంటి పలు అంశాలపై సర్వే నిర్వహించామని ముందడుగు బృందం తెలిపింది.

### పిఠాపురంపై పలు రకాలుగా సర్వే

జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పోటీ చేస్తున్న పిఠాపురం నియోజకవర్గంపై పలు మార్లు ఆన్ లైన్, ఆఫ్ లైన్ ద్వారా సర్వే నిర్వహించినట్లు ముందడుగు తెలిపింది. ఆంధ్రాలో ముందడుగు చేసిన పూర్తి సర్వే వివరాలను త్వరలో విడుదల చేస్తామని ముందడుగు బృందం తెలిపింది.





# అమిటీ యూనివర్శిటీ ముంబై షోకేస్ వద్ద బాంబే టైమ్స్ ఫ్యాషన్ వీక్ 2024

**ముందడుగు హైదరాబాద్**

అమిటీ యూనివర్శిటీ ముంబైలోని స్కూల్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీ బాంబే టైమ్స్ ఫ్యాషన్ వీక్ 2024లో 'తరంగ్' కలెక్షన్‌ను ప్రదర్శించింది. 18 మంది విద్యార్థి డిజైనర్లు 20 వస్త్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రొ. (డా.) ఎ.డబ్ల్యు. అమిటీ యూనివర్శిటీ ముంబై వైస్‌ఛాన్సలర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ, "అమిటీ యూనివర్శిటీ ముంబై బాంబే టైమ్స్ ఫ్యాషన్ వీక్‌తో అనుబంధం కలిగి ఉన్నందుకు గర్వంగా ఉంది, ఇది ఒక అద్భుతమైన ప్రదర్శన, ఇది రంగాలలో అనుభవజ్ఞులైన ఫ్యాషన్ పరిశ్రమ ఐకాన్‌లతో పోల్చితే మా విద్యార్థుల నైపుణ్యం యొక్క ప్రతిభను ప్రదర్శిస్తుంది. డిజైన్, కొరియోగ్రఫీ, ఫ్యాషన్ ప్రదర్శన మరియు థీమ్. అమిటీ స్కూల్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ హ్యాండ్‌ఆన్ అప్రోచ్ మరియు ఇండస్ట్రీ సహకార మోడల్‌ను కలిగి ఉంది, అందుకే మా విద్యార్థులు దేశవ్యాప్తంగా ఇటువంటి అనేక ఫ్యాషన్ షోలలో రాణిస్తున్నారు మరియు సంస్థకు అవార్డులను తెస్తున్నారు.



# ఇంకెన్ని సంవత్సరాలు మోసపోతారు

- మార్పుకు చదువుకున్న వాళ్లే శ్రీకారం చుట్టాలి
- యువత ఓటుపై అవగాహన కల్పించాలి
- ఉత్తర విశాఖలో జెడీ లక్ష్మినారాయణ భారీ ర్యాలీ

**ముందడుగు విశాఖపట్నం:**

మంచి రాజకీయాలు రావాలి, మంచి పరిపాలన అందరికి అందాలంటే ప్రతి ఒక్కరూ ఓటెసి, ప్రజల పార్టీ జై భారత్ ను గెలిపించాలని జెడీ లక్ష్మి నారాయణ అన్నారు. శుక్రవారం ఉత్తర విశాఖలో నియోజకవర్గం మొత్తం భారీ ర్యాలీ నిర్వహించారు. వైభవ్ వెంకటేశ్వర స్వామి దగ్గర ప్రారంభమైన ర్యాలీ మురళీ నగర్, ఉడా కాలనీ, మారియట్ హోటల్, మర్రిపాలెం, కంచెరపాలెం, తాడిచెర్లపాలెం, మహరాణి పార్లర్, దొండపర్తి జంక్షన్, శంకర మఠం, సీతమ్మపేట, సత్యం జంక్షన్, ఎంఆర్ఓ ఆఫీసు రోడ్డుతో పాటు వివిధ ప్రాంతాలలో భారీ ఎత్తున వందలాది కార్లు, బైక్ లతో ర్యాలీ నిర్వహించారు. జెడీ ర్యాలీకి నియోజకవర్గంలోని ప్రజలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు.



### ప్రజల పార్టీని గెలిపించండి

జై భారత్ పార్టీ అధికార దాహంతో పెట్టింది కాదని, ఇది ప్రజల పార్టీ, ప్రజల కోసం పెట్టిన పార్టీ అని జెడీ లక్ష్మినారాయణ అన్నారు. ఇప్పటి వరకు ఎన్నికల్లో ప్రజలను మోసం చేసే రాజకీయ పార్టీలు కలిశాయని, కాని జై భారత్ పార్టీ మాత్రం ప్రజల పార్టీ అని అన్నారు. పోలింగ్ రోజు మీరు ఓటు వేయడమే కాకుండా ప్రతి ఒక్కరూ మీ చుట్టుప్రక్కల వారిని కూడా ఓటు వేసేలా చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన అన్నారు. ఇన్ని సంవత్సరాలు మోసపోయింది చాలని, ఇప్పుడు మీ జీవితాల కోసం, మీ పిల్లల భవిష్యత్తు కోసం నిజాయితీకి పట్టం కట్టాలన్నారు.

### యువత భవిష్యత్తుకు నాది భరోసా

మంచి రాజకీయం, అవినీతి నిర్మూలన యువత చేతిలో ఉందని, సమాజంపై అవగాహన పెంచుకుంటూ, అందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. తాను ఉత్తర విశాఖ ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని అన్నారు. చదువుకున్న యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని విశాఖ కేంద్రంగా సాగుతున్న గంజాయి వ్యాపారానికి అడ్డుకట్ట వేస్తానని అన్నారు. యువత ఉద్యోగ అవకాశాలు ఉన్నప్పుడే మాదకద్రవ్యాలకి దూరంగా ఉంటారని తద్వారా ఉన్నత భవిష్యత్తును ఏర్పరచుకోవచ్చని అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత యువతకు పెద్దపీఠం వేస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తాను అని అన్నారు.



